
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
మంచిర్యాల జిల్లా వార్తలు
5
ఆదివారం 29 డిసెంబరు 2024



# పెరుగుతున్న నేరాలు




- క్షణికావేశంలో హత్యలు, ఆత్మహత్యలు
- పెరిగిన ఆన్‌లైన్ మోసాలు
- జోరుగా గంజాయి విక్రయాలు
- నిత్యకృత్యమైన వ్యభిచారం, జూదం
- భారీగా నకిలీ విత్తనాల సరఫరా

మంచిర్యాల, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో క్రైం రేట్ వేగంగా పెరుగుతోంది. పోలీస్‌శాఖ అసాంఘిక కార్యకలాపాలను అణిచివేస్తున్నప్పటికీ చాపకింద నీరులా పెరిగిపోతూనే ఉండటం సర్వత్రా ఆందోళనను కలిగిస్తోంది. జిల్లాలో వ్యభిచారం, జూదం నిత్యకృత్యం కాగా గంజాయి వినియోగం, నకిలీ విత్తనాల సరఫరా విస్తరిస్తోంది. పట్టణాలు, పల్లెలు అనే తేడా లేకుండా అసాంఘిక కార్యక్రమాలు నిత్యం ఎక్కడో ఒక చోట జరుగుతూనే ఉన్నాయి. ఆన్‌లైన్ గేమ్‌లకు బానిస అవుతున్న యువత, ఉద్యోగస్తులు కుటుంబాలతో సహా బలవంతపు మరణాలకు పాల్పడుతుండటం ఆందోళన కలిగిస్తోంది.

## విస్తరిస్తోన్న గంజాయి వినియోగం..

జిల్లాలో గంజాయి వినియోగం ప్రమాదకరంగా విస్తరిస్తోంది. కళాశాల విద్యార్థులు, యువతే లక్ష్యంగా సరఫరా జరుగుతోంది. మత్తుకు బానిసైన యువత



మంచిర్యాలలో పట్టుబడ్డ నకిలీ విత్తనాలు, నిందితులు (ఫైల్)

దాని కోరల్లో చిక్కి భవిష్యత్‌ను అంధకారం చేసుకుంటున్నారు. యువత బలహీనతలను ఆసరాగా చేసుకుంటున్న ఏజెంటు వ్యవస్థ గంజాయి సేవనాన్ని ఒకరి నుంచి ఒకరికి అలవాటు చేస్తూ అందిన కాడికి దండుకుంటున్నారు. స్మగ్లర్లు రైలు మార్గం ద్వారా గంజాయి సరఫరా చేస్తున్నారు. మహారాష్ట్ర, వరంగల్ ప్రాంతం నుంచి పలు రైళ్ల ద్వారా మంచిర్యాలకు గంజాయిని తరలిస్తున్న వ్యాపారులు దాన్ని ఇక్కడి ఏజెంట్లకు విక్రయిస్తున్నారు. రైళ్లతోపాటు రోడ్డు మార్గంలోనూ గంజాయి సరఫరా అధికంగా జరుగుతోంది. మంచిర్యాల బస్టాండులోనూ ఓ మహిళ వద్ద పోలీసులు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

సెప్టెంబరులో శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం సమీపంలో ట్రాక్టర్ బోల్తా పడగా, రెండు రోజుల అనంతరం దాని నుంచి పెద్ద మొత్తంలో గంజాయి సంచులు బయటపడటం పోలీసులను నివ్వెరపరిచింది. స్మగ్లర్లు పరారుకాగా, గంజాయి సంచులతో ఉన్న ట్రాక్టర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా కేంద్రంలోని హమాలివాడ పోచమ్మ చెరువు, పాత మంచిర్యాలలోని సబ్ స్టేషన్ ఏరియా, శాలివాహన విద్యుత్ ప్లాంటు సమీపం లోని నిర్మానుష్య ప్రాంతంలో యువత విచ్చల విడిగా గంజాయి సేవిస్తున్నారు. కాలేజీ రోడ్డులో నూ గంజాయి వ్యాపారం జోరుగా సాగుతోంది. గతేడాది బెల్లంపల్లిలోని పాలిటెక్నిక్ కళాశాలలో గంజాయి సేవిస్తున్నారనే సమాచారంతో ఆరుగురు విద్యార్థులను సస్పెండ్ చేశారు. గంజాయితోపాటు అత్యంత ప్రమాదకరమైన మత్తు పదార్థం హెరాయిన్ కూడా జిల్లాలో విరివిగా లభ్యం అవుతోంది.

## పెరుగుతున్న ఆత్మహత్యలు

జిల్లాలో ఆత్మహత్యలు పెరుగుతున్నాయి. ఆర్థిక ఇబ్బందులతో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ఆత్మహత్య చేసుకున్న సంఘటన సెప్టెంబరు 1న మంచిర్యాల జిల్లా కేంద్రంలో జరిగింది. రెడ్డి కాలనీకి చెందిన ఇప్ప వెంకటేష్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసేవాడు. అక్కడి గాజుల రామారం ఏరియాలో ఓ అపార్ట్‌మెంట్‌లో భార్య వర్షిణి, కుమారులు రిషికాంత్, విహాంత్ లతో కలిసి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వెంకటేష్ ఆన్‌లైన్ ట్రేడింగ్, బెట్టింగ్‌లలో రూ.20లక్షల వరకు

మిగతా 7వ పేజీలో..

**జిల్లాలో నమోదైన కేసుల వివరాలు...**

జిల్లాలో ఈ ఏడాది నవంబరు వరకు నమోదైన వివిధ కేసుల వివరాలు ఇలా ఉన్నాయి.

| |
|---|
| హత్య కేసులు - 23, దొంగతనాలు - 355, |
| ఆత్మహత్యలు -8, కిడ్నాప్‌లు -55, |
| రేప్ కేసులు -41, కొట్లాటలో గాయాలు -507, |
| మోసాలు -381, హత్యాయత్నాలు -40, |
| రోడ్డు ప్రమాదాలు-123, |
| ఇతర ప్రమాదాలు-258, |
| చట్ట వ్యతిరేక కార్యకలాపాలు -469, |
| మిస్సింగ్ కేసులు -273, అగ్ని ప్రమాదాలు-19 |




## జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న పంచాయతీ కార్మికులు

నస్పూర్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ గ్రామ పంచాయతీ అండ్ ఉద్యోగ సంఘాల జేఏసీ పిలుపులో భాగంగా శనివారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రధాన రహదారి నుంచి కలెక్టరేట్‌కు తరలివచ్చారు. ధర్నా అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ కుమార్ దీపక్‌కు అందజేశారు. గ్రామ పంచాయతీ యూనియన్ (సీఐటీయు) జిల్లా గౌరవ అధ్యక్షుడు దుంపల రంజిత్‌కుమార్ మాట్లాడుతూ జీవో నంబరు 51ని సవరించి పెండింగ్ వేతనాలు చెల్లించాలన్నారు. మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలన్నారు. కార్మికులపై పని భారం మోపడం, ప్రతీ నెల వేతనాలు చెల్లించాలన్నారు. నాయకులుఅంబటి లక్ష్మన్, రామిళ్ళ రాయలింగు, యూనియన్ జిల్లా కన్వీనర్ చిన్నయ్య, కోకన్వీనర్ సాగర్, నాయకులు రాజలింగు, రాజన్న, సుధాకర్, బానయ్య, బాపు, రవి, దుర్గ, అమ్మాయి. లక్ష్మి, యశోద, లత, మంగ పాల్గొన్నారు.

## ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగుల నిరసనలు



టోపీలు ధరించి నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులు

నస్పూర్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న సమ్మె కొనసాగుతోంది. శనివారం శిబిరంలో గాంధీ టోపీలు ధరించి మౌన దీక్ష చేపట్టారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట నల్ల దుస్తులతో ఉద్యోగులు నిరసన చేపట్టారు. ప్రభుత్వం తమ డిమాండ్లను సత్వరమే పరిష్కరించాలని జేఏసీ అధ్యక్షురాలు సుమలత, ప్రధాన కార్యదర్శి రాజన్నలు డిమాండ్ చేశారు. శిబిరాన్ని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ సుధాకర్, జిల్లా నేతలు సందర్శించి మద్దతు తెలిపారు.

## దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి




మాట్లాడుతున్న సుధాకర్, పక్కన పార్టీ నాయకులు

నస్పూర్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): అవినీతి అక్రమాలపై ప్రశ్నిస్తున్న తమ పార్టీకి చెందిన నాయకులపై దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ సుధాకర్ డిమాండ్ చేశారు. నస్పూర్ ప్రెస్ క్లబ్‌లో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 18న తమ నాయకుడు నయీమ్ పాషాపై కొందరు దాడికి పాల్పడ్డారన్నారు. దాడికి పాల్పడిన వ్యక్తులపై నామమాత్రపు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ విషయంపై సీపీకి ఫిర్యాదు చేయనున్నట్లు సుధాకర్ తెలిపారు. ఆమ్ ఆద్మీ పార్టీ కోర్ కమిటీ సభ్యులు రాము గౌడ్, మజీద్, జిల్లా అధ్యక్షుడు నల్ల నాగేంద్రప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి నయీమ్‌పాషా, రాష్ట్ర యూత్ అధ్యక్షుడు విజయ్ మల్లంగి, నాయకులు జునైద్, వికాస్, మేకల శ్రీనివాస్, రాజేందర్ పాల్గొన్నారు.

## బోర్‌వెల్‌ల ఏర్పాటు

కాసిపేట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తాగునీటి ఎద్దడి నివారించేందుకు చేతి పంపులను ఏర్పాటు చేస్తున్నామని సోమగూడెం లంబాడితండా మాజీ ఉపసర్పంచు బానోత్ పరశురామ్ అన్నారు. శనివారం గ్రామంలో చేతి పంపుల ఏర్పాటు పనులను ప్రారంభించి మాట్లాడారు. స్థానికులు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే వినోద్ దృష్టికి తీసుకువెళ్లగా మంజూరు చేశారన్నారు. తిరుమల్, హన్మంతు, విజయ్ పాల్గొన్నారు.

## ప్రమాదకరంగా వై జంక్షన్

- నెల రోజుల్లో పది ప్రమాదాలు
- 13 మందికి గాయాలు, ఇద్దరి మృతి



వై జంక్షన్ వద్ద పరిశీలిస్తున్న పోలీసులు, హైవే అధికారులు (ఫైల్)

కాసిపేట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కాసిపేట పోలీస్‌స్టేషన్ పరిధి సోమగూడెం నుంచి బెల్లంపల్లి వై జంక్షన్ వరకు రహదారిపై నెల రోజుల్లో పది రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ప్రమాదాల్లో 13 మందికి గాయాలు కాగా, ఇద్దరు మృతిచెందారు. ఈ నెల 11న బెల్లంపల్లికి చెందిన సింగరేణి రిటైర్డు కార్మికుడు కుటుంబీకులతో కారులో శ్రీరాంపూర్ వెళ్లి తిరిగి వస్తుండగా వై జంక్షన్ వద్ద వేగంగా వచ్చిన వ్యాన్ ఢీకొట్టింది. ఈ ఘటనలో బెల్లంపల్లికి చెందిన దెబ్బెటి తిరుపతి అక్కడికక్కడే మృతిచెందగా డ్రైవర్‌తో పాటు నలుగురు కుటుంబీకులు గాయాలపాలయ్యారు. శుక్రవారం రాత్రి వై జంక్షన్ జరిగిన ప్రమాదంలో కారును వ్యాన్ వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో బెల్లంపల్లికి చెందిన ఇద్దరు గాయాలపాలయ్యారు. వై జంక్షన్ వద్ద తరుచూ ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వాహనదారులు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

**ప్రమాదాల నివారణకు శాశ్వత ప్రణాళిక**

**- సునీల్, నేషనల్ హైవే అథారిటీ అధికారి**

జాతీయ రహదారిపై జరుగుతున్న ప్రమాదాలను నివారించేందుకు శాశ్వత ప్రణాళికలు చేపడుతున్నాం. దీనిపై పోలీసుల భాగస్వామ్యంతో కమిటీ ద్వారా నివేదికను రూపొందించి ఉన్నతాధికారులకు పంపించాం. త్వరలోనే ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపడతాం.

**హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేస్తున్నాం**

**- ప్రవీణ్‌కుమార్, కాసిపేట ఎస్‌ఐ**

వై జంక్షన్ వద్ద జరుగుతున్న ప్రమాదాలను నివారించేందుకు జీబ్రాలైన్స్‌తో పాటు ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేస్తాం. తాత్కాలికంగా బారికేడ్లను ఏర్పాటు చేశాం. వాహనదారులు అతి వేగంగా వాహనాలు నడపవద్దు. రోడ్డుప్రమాదాల నివారణకు ప్రత్యామ్నాయ చర్యలను చేపడుతున్నాం.

**కూరగాయల జ్యూస్‌కు డిమాండ్**
- వెలుస్తున్న వెజిటబుల్ జ్యూస్ సెంటర్లు
- ఆసక్తి చూపుతున్న ప్రజలు

7



**కనిపించని అభివృద్ధి..**
- పెండింగ్‌లోనే సాగునీటి ప్రాజెక్టులు
- పూర్తి కాని ప్రధాన వంతెనలు
- అతీగతిలేని రోడ్లు

6

## సిబ్బంది వేతనాల్లో కార్యదర్శి చేతివాటం

- విధుల్లో లేని కారోబార్ పేరిట వేతనం
- కార్యదర్శి స్నేహితుడి ఖాతాలో జమ

కోటపల్లి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కోటపల్లి గ్రామ పంచాయతీ సిబ్బంది వేతనాల్లో పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ చేతివాటం ప్రదర్శించాడు. ఈ విషయమై శనివారం మాజీ కారోబార్ కొంకటి సుందర్ తహసీల్దార్ మహేంద్రనాథ్‌కు ఫిర్యా దు చేశారు. నలుగురు మల్టీపర్పస్ వర్కర్లు సరిగ్గా పని చేయ లేదంటూ వారికి తక్కువ వేతనాలు చూపించి రూ.21,450లను మాజీ కారోబార్ కొంకటి సుందర్ పేరుపై చూపెట్టాడు. కొంకటి సుందర్ కారోబార్‌గా పనిచేసి జూన్‌లో వృత్తిని మానుకున్నాడు. ఒక నెల వేతనం రూ.21,450 కార్యదర్శి స్నేహితుడైన నల్మాసు రమేష్ అకౌంట్‌లో జమ చేశాడు. ఈ విషయం సుందర్‌కు తెలి యడంతో శనివారం ఆయన తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశాడు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తహసీల్దార్ పేర్కొన్నారు. ఎంపీడీవో లక్ష్మయ్యను వివరణ కోరగా మెమో జారీ చేశామని, రెండు రోజుల్లో గ్రామపంచాయతీ అకౌంట్‌లో వేతనం జమ చేయాలని ఆదేశించినట్లు తెలిపారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గర్మిళ్ల, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాజీవ్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఆదివారం ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ వేణుగోపాల్, ఏఈ శ్రీనివాస్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. 33కేవీ లైన్ ఏర్పాటు చేస్తున్నందున విద్యుత్ ఉండదని తెలిపారు. రాజీవ్‌నగర్, తెలంగాణ నగర్, దొరగారిపల్లె, ఏక్యాబిన్, వేములబస్తీ, హమాలీవాడ, తిలక్‌నగర్, తోళ్లవాగు, శ్రీశ్రీ నగర్, సాయికుంట, అశోక్‌రోడ్డు, గణేష్‌నగర్, గాంధీనగర్‌లలో సరఫరా ఉండదని తెలిపారు.

**నస్పూర్, (ఆంధ్రజ్యోతి):** నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలో ఆదివారం విద్యుత్ సరఫరాలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు అంతరాయం ఉంటుందని ఏడీఈ మోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పాత మంచిర్యాల 132 కేవి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

## న్యూ ఇయర్ వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలి



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీసీపీ భాస్కర్

మంచిర్యాల, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): న్యూ ఇయర్ వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ సామాన్య ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే చట్టపరంగా చర్యలు తప్పవని డీసీపీ భాస్కర్ హెచ్చరించారు. శనివారం పట్టణ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి పలువురు రౌడీషీటర్స్‌కు కౌన్సెలింగ్ నిర్వహించారు. డీసీపీ మాట్లాడుతూ డిసెంబర్ 31 రాత్రి నూతన సంవత్సర వేడుకల్లో చట్టవ్యతిరేకమైన కార్యకలాపాలకు పాల్పడకూడదని, ప్రజలకు ఇబ్బందులు కలిగించవద్దని సూచించారు. వేడుకలను కుటుంబ సమేతంగా, ఇళ్లలో సంతోషంగా నిర్వహించుకోవాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, ట్రిపుల్, రాష్, రాంగ్ రూట్ డ్రైవింగ్, దాడులు, బెదిరింపులకు పాల్పడడం, రోడ్లపై వెళ్ళేవారిని ఇబ్బందికి గురిచేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రధాన కూడళ్లలో డ్రంకెన్ డ్రైవ్, ఆకస్మిక తనిఖీలతోపాటు నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించాలని పోలీసు అధికారులకు సూచించారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను బయటకు పంపించి ఇబ్బందులు పడవద్దన్నారు. ఏసీపీ ప్రకాష్, టౌన్ సీఐ ప్రమోదరావు, మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ నరేష్ కుమార్, ఎస్సైలు పాల్గొన్నారు.

**క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలి**



ఏసీపీ వెంకటేశ్వర్‌కు మొక్క అందజేస్తున్న ఎస్‌ఐ శ్రీధర్

జైపూర్, (ఆంధ్రజ్యోతి): పోలీసులు క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలని ఏసీపీ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. శనివారం పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలను దృష్టిలో ఉంచుకుని మెలగాలని సూచించారు. ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు ప్రతీ పోలీసు హెల్మెట్ ధరించాలన్నారు. స్టేషన్‌కు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం పోలీస్‌స్టేషన్ ఆవరణను పరిశీలించి పరిశుభ్రంగా ఉండడంతో సిబ్బందిని అభినందించారు. శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్, జైపూర్ ఎస్‌ఐ శ్రీధర్ పాల్గొన్నారు.

## పొంచి ఉన్న ప్రమాదం..



నెల్కివెంకటాపూర్ గ్రామ శివారులో ప్రధాన రహదారిపై వంగిన తుమ్మ చెట్టు

దండేపల్లి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి-లక్షెట్టిపేట ప్రధాన రహదారి నెల్కివెంకటాపూర్ గ్రామ సమీపంలో ఓ తుమ్మ చెట్టు రోడ్డుపైకి వంగి ఉంది. నిత్యం ఈ రహదారి గుండా ఆదిలాబాద్, నిర్మల్ వైపునకు లోడ్‌లతో వాహనాలు వెళుతుంటాయి. వాహనాలకు తుమ్మ చెట్టు కొమ్మలు తాకడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రమాదం జరగక ముందే అధికారులు స్పందించి కొమ్మలు, చెట్టు పొదలను తొలగించే విధంగా చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

# కనిపించని అభివృద్ధి



- పెండింగ్‌లోనే సాగునీటి ప్రాజెక్టులు
- పూర్తి కాని ప్రధాన వంతెనలు
- అతీగతిలేని రోడ్లు

ఆసిఫాబాద్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ ఏడాది కూడా సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందగా మారాయి. జిల్లాలో దాదాపు అన్ని మండలాలు ఆదివాసీ ప్రాంతాలే కావడంతో మౌలిక సదుపాయాలపై ప్రభుత్వం ఈ ఏడాది కూడా శీతకన్ను వేసిందని చెప్పాలి. దీంతో జిల్లాలో అభివృద్ధి వెలుగులు అందని ద్రాక్షలా మిగిలిపోయాయి.

### పెండింగ్‌లోనే సాగునీటి ప్రాజెక్టులు..

జిల్లా రైతాంగానికి వర్షాధారమే దిక్కవుతోంది. ఏళ్లుగా ప్రధాన ప్రాజెక్టులన్నీ పెండింగ్‌లో ఉండడంతో సాగులో పెద్దగా మార్పులేదు. సరైన సాగునీటి వసతి లేక వేలాదిఎకరాల భూమి నిరుపయోగంగా మారుతోంది. గత్యంతరం లేక ఆరుతడి పంటలతో సరిపెట్టాల్సి వస్తోంది. వానొస్తే పంట లేకుంటే లేదు అన్న చందంగా మారింది. ప్రాజెక్టులు పూర్తై సక్రమంగా నీరందిస్తే తప్ప సాగు పండుగలా మారే పరిస్థితి కనిపించడం లేదు. జిల్లాలో ప్రధానంగా కుమరంభీం, జగన్నాథ్‌పూర్ ప్రాజెక్టులు నిర్మాణ దశ వీడడం లేదు. అదే విధంగా వట్టివాగు, చెలిమెల వాగు ప్రాజెక్టు కాలువలు మరమ్మతులకు నోచుకోవడం లేదు. ప్రభుత్వం జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులకు నిధులు మంజూరు చేయకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

### పూర్తికాని ప్రధాన వంతెనలు..

గ్రామాలకు రవాణా కష్టం తీర్చేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషి ఫలించడం లేదు. ఆసిఫాబాద్ మండలంలోని పెద్దవాగుపై గుండి వంతెన నిర్మాణపనులు దశాబ్ద న్నరగా కొనసాగుతున్నాయి. దీంతో గుండి గ్రామస్థుల కష్టాలు తొలగడం లేదు. కెరమెరి మండలంలోని ఉమ్రి వంతెన అసంపూర్తిగా ఉండడం వల్ల మహారాష్ట్రలోని 12 గ్రామాలకు రాకపోకలకు లేవు. మండలంలోని అనార్‌పల్లి- కరంజివాడ, లక్మాపూర్ వంతెనల నిర్మాణ పనులు కూడా అసంపూర్తిగానే ఉన్నాయి. కాగజ్‌నగర్- వాంకిడి మండలాల మధ్య కనర్‌గాం వద్ద నిర్మి స్తున్న వంతెన పనులు 15సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ అసంపూర్తిగానే ఉంది.




### అతీగతి లేని రోడ్లు..

రహదారులు అభివృద్ధికి కేంద్ర బిందువులు. అలాంటి కీలకమైన వ్యవస్థకే జిల్లాలో అతీగతి లేని పరిస్థితి. ఏజెన్సీ ప్రాంతమైన జిల్లాలో నేటికీ 449గిరిజన గ్రామాలు రోడ్డు సౌకర్యానికి నోచుకోవడం లేదు. ప్రతి యేటా రోడ్ల నెట్‌వర్క్‌ను మెరుగుపరిచేందుకు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నట్లు చెబుతున్న ప్రభుత్వాలు గిరిజన ప్రాంతాలపై శీతకన్ను వేయడం ఇక్కడి ప్రజలకు శాపంగా పరిణమిస్తోంది.జిల్లాలో 15 మండలాల్లోనూ సగానికి సగం గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేదు. ఇక వర్షాకాలం వచ్చిందటే చాలు జిల్లాలోని ఏజెన్సీగ్రామాల్లో దుర్భర పరిస్థితులు ఉత్పన్న మౌతాయి. వాగులు,వంకలు ఉప్పొంగి ప్రవహించి నప్పుడల్లా గిరిగ్రామాలు బాహ్యప్రపంచానికి దూరంగా రోజుల తరబడి ఉండాల్సిన పరిస్థితులు ఉన్నాయి. సిర్పూర్ నియోజకవర్గ పరిధిలోని దహెగాం, పెంచికలపేట, కౌటాల మండలంలోని కొన్నిగ్రామాల రోడ్ నెట్‌వర్క్ అత్యంత దయనీయంగా ఉంది.

అలాగే ఆసిఫాబాద్ నియోజకవర్గ పరిధిలోని ఆసిఫాబాద్, కెరమెరి, జైనూర్, వాంకిడి, సిర్పూర్(యు), లింగాపూర్,తిర్యాణి మండలాల్లో ఇంచుమించు ఇదే పరిస్థితి. రోడ్ల నెట్‌వర్క్‌ను మెరుగు పరిచేందుకు ప్రజాప్రతినిధులు ప్రతిపాదనలు ఇస్తున్నా ప్రభుత్వం నిధులు మంజూరు చేయక పోవడం వల్ల ఈ పరిస్థితి నెలకొంటున్నది. దీనికి తోడు ఏజెన్సీ మండలాలో రోడ్ల నిర్మా ణాలకు అటవీ అనుమతులు అడ్డంకిగా మారాయి. ఇక ఏజెన్సీ మండలాలైన జైనూర్, సిర్పూర్(యు), లింగాపూర్ మండలాల్లోని గిరిజన గూడాలకు వర్షాకాలంలో రోడ్డుసౌకర్యం మూసుకుపోయి బాహ్యప్రపంచంతో వారాల తరబడి సంబంధాలు తెగిపోయే పరిస్థితులు ఉన్నాయి.

అధ్వానంగా ఉన్న గ్రామాల రోడ్లు



పూర్తికాని జగన్నాథ్‌పూర్ ప్రాజెక్టు, ఆసిఫాబాద్ మండలంలో పూర్తికాని గుండి వంతెన, కెరమెరి మండలంలో అసంపూర్తిగా ఉన్న ఉమ్రి వంతెన

## పిచ్చికుక్క దాడిలో ఏడుగురికి గాయాలు

దహెగాం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శనివారం పిచ్చికుక్కల దాడిలో ఏడుగురికి గాయాలయ్యాయి. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. తుమ్మిడి చంద్రయ్య పెంపుడు కుక్క వారి ఇంటికి వెళ్లిన వారిపై దాడిచేయడంతో ఏడుగురికి గాయాలయ్యాయి. మధుకర్‌గౌడ్‌ను వెనకనుంచి వచ్చి దాడిచేసి గాయ పర్చింది. అలాగే దివ్యాంగుడు తుమ్మిడి రాజును కాలుపై కరిచింది. కుక్కదాడిలో విజయ్‌కుమార్, మల్లక్క, మధుకర్ గౌడ్, పున్నం, శ్రీనివాస్, తిరుపతి, రాజుకు గాయాలు కాగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స చేయించుకున్నారు.

## అనారోగ్యంతో మాలమహానాడు నాయకుడి మృతి



మధు (ఫైల్)

బెల్లంపల్లి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన మాలమహానాడు సీనియర్ నాయకుడు కుసు మ మధు(55) శనివారం అనారోగ్యంతో మృతి చెందాడు. మధు కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఆరోగ్య పరిస్థితి విషమించి ఇంట్లోనే మృతిచెందాడు. మృతుడికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. ఈయన మృతి పట్ల ఎస్సీ ఎస్టీ కమిషన్ మెంబర్ రేణికుంట్ల ప్రవీణ్, కుంబాల రాజేష్, మద్దెల గోపి, సబ్బని కృష్ణ తదితరులు మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం అంతిమయాత్రలో పాల్గొని పాడె మోశారు.

## చికిత్స పొందుతూ సీపీఐ నాయకుడి మృతి




వెంకటస్వామి (ఫైల్)

పట్టణానికి చెందిన సీపీఐ ఏఐటీయూసీ సీనియర్ నాయకుడు గుండ వెంకటస్వామి (47) అనారోగ్యంతో శుక్రవారం రాత్రి కరీంన గర్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతుండగా కుటుంబీకులు కరీంనగర్ ఆసుపత్రిలో చేర్పించారు. ఈ క్రమంలో పరిస్థితి విషమించి మృతి చెందాడు. శనివారం మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించగా వివిధ పార్టీల నాయకులు నివాళులర్పించారు. మృతుడికి భార్యకొడుకు, కూతురు ఉన్నారు.

## వాహనదారులు పత్రాలు కలిగి ఉండాలి



కార్డెన్ సెర్చ్‌లో పట్టుబడిన కార్లు

శ్రీరాంపూర్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): వాహనదారులు సరైన ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలని సీఐ వేణుచందర్ అన్నారు. శ్రీరాంపూర్‌లోని అరుణక్కనగర్ పోలీసు కమ్యూనిటీ కాంట్రాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. సరైన పత్రాలు లేని 25 ద్విచక్ర వాహనాలు, 4 ఆటోలు, 5 కార్లను సీజ్ చేశారు. అనంతరం సీఐ మాట్లాడుతూ, నియమ, నిబంధనలు అతిక్రమిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏరియాలో కొత్త వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. శ్రీరాంపూర్, జైపూర్, భీమారం ఎస్‌ఐలు సంతోష్, శ్వేత, శ్రీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

## కృత్రిమ గర్భధారణతో మేలు జాతి పశువులు



పశువైద్య శిబిరంలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న పశువైద్యాధికారి ధన్‌రాజ్, సిబ్బంది

దండేపల్లి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): కృత్రిమ గర్భధారణ ద్వారానే మేలురకపు పశుసంతతి పెంపొందుతుందని మండల పశువైద్యాధికారి డాక్టర్ ధన్‌రాజ్ రైతులకు సూచించారు. శనివారం గుడిరేవు గోపాలమిత్ర కృత్రిమ గర్భధారణ కేంద్రంలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. గేదెలు చలికాలంలో ఎక్కువగా ఎదకు వస్తాయని, రైతులు సకాలంలో ఈ విషయాన్ని గుర్తించి సమీపంలో ఉన్న పశువైద్యశాలలో లేక గోపాలమిత్రల ద్వారా కృత్రిమ గర్భధారణ చేయించాలన్నారు. ఈప్రక్రియను మండల రైతులు గమనించి సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామంలోని 33పశువులకు ఉచిత గర్భకోశవ్యాధి నివారణ, పశువైద్య చికిత్సలు, కృత్రిమ గర్భధారణ ద్వారా పుట్టిన 19 దూడలకు నట్టల నివారణ మందులను వేశారు. గోపాలమిత్ర జిల్లా సూపర్‌వైజర్ల సుజాత, గోపాలమిత్ర శ్రావణ్‌కుమార్, కుమారస్వామి, అభిలాష్, పశుపోషకులు, స్థానికులు పాల్గొన్నారు.

## కమాన్ నిర్మాణానికి పరిశీలన

మందమర్రిరూరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిర్రకుంట గ్రామంలో గ్రామ కమాన్ ఏర్పాటు చేసేందుకు అధికారులు శనివారం స్థలాన్ని పరిశీలించారు. ఇటీవల మండల కాంగ్రెస్ నాయకులు గందె రాంచందర్, ఒడ్నాల కొమురయ్యలు కమాన్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామిని కోరారు. ఎమ్మెల్యే సింగరేణి అధికారులకు ఆదేశాలు ఇవ్వడంతో అధికారులు కమాన్ నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలించారు. వర్క్‌షాప్ ఇంజనీర్ సత్యగౌడ్, నాయకులు పాల్గొన్నారు.

## కూలీల కొరత.. చెట్లపైనే పత్తి



మందమర్రి టౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : కూలీల కొరతతో పత్తి చేనులోనే రాలిపోతుంది. పట్టణంలోని కేకే 5 గని సమీపంలో దాదాపు 40 ఎకరాల్లో రైతులు పత్తిని సాగు చేశారు. పత్తి ఏరేందుకు కొద్ది రోజులుగా కూలీలు ఎవరు రాకపోవడంతో చేనుల్లోనే పత్తి రాలుతుంది. ఇటీవల రాజస్థాన్ నుంచి కొందరు కూలీలను తీసుకువచ్చినప్పటికి కిలోకు రూ.7 చొప్పున చెల్లించారు. ఇటీవల తిరిగి వారి స్వగ్రామానికి వెళ్లారని ఓ రైతు వాపోయాడు. దీంతో 40 ఎకరాల్లో పత్తిని ఏరేవారు లేక రాలిపోయే దశకు చేరుతుందని, పంట చేతికి వచ్చే సమయంలో కొంత ఇబ్బంది పడగా పూర్తిగా పండిన సమయంలో కూలీలు లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. పంట కోసం చేసిన అప్పులకు వడ్డీ చెల్లించలేక పోతున్నామని వాపోయారు.

## అనాథాశ్రమానికి బియ్యం విరాళం

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్‌లోని శ్రీసాయి అనాథ వృద్ధాశ్రమానికి శనివారం ఆసిఫాబాద్ పట్టణంలోని ఏపీజే అబ్దుల్‌కలాం ఉన్నతపాఠశాల చైర్మన్ సయ్యద్‌అబ్దుల్ ఫయాజ్ బియ్యం విరాళంగా అందజేశారు. విద్యార్థులు ఇచ్చిన విరాళంతో బియ్యంను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ అబుల్ హసన్, ప్రిన్సిపాల్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలలు తనిఖీ

జైనూర్, డిసెంబరు, డిసెంబరు28(ఆంధ్రజ్యోతి): మండంలోని శివనూర్, మార్లావాయి, లేండిగూడ ప్రాథమికోన్నత పాఠశాలల్ని శనివారం అధికారులు తనిఖీ చేశారు. ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి మార్లావాయిలో, సూపరింటెండెంట్ శ్రీనివాస్ లేండిగూడలో, ఎంపీవో మోహన్ శివనూర్‌లోని ప్రాథమికోన్నత పాఠశాలల్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన, ఉపాధ్యాయుల బోధన తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు మెనూప్రకారం మధ్యాహ్న భోజనం, నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు.

## ఆర్యవైశ్య వధూవరుల పరిచయ వేదికను విజయవంతం చేయాలి

ఆసిఫాబాద్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని చిలుకూరి గార్డెన్‌లో ఫిబ్రవరి19న నిర్వహించే ఆర్యవైశ్య వధూవరుల పరిచయవేదికను విజయవంతం చేయాలని మేళా కమిటీ ప్రతినిధి విఠల్‌రావు కోరారు. జిల్లాకేంద్రంలోని వాసవీ మందిరంలో శనివారం ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులతో కలిసి పరిచయవేదిక పోస్టర్లను విడుదల చేశారు. ఈ అవకాశాన్ని ఆర్యవైశ్య వధూవరులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆసక్తి గలవారు ఫిబ్రవరి5లోగా తమ బయోడాటా వివరాలను వాట్సాప్ నెం:9293750507కు పంపించాలని తెలిపారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

పెంచికలపేట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొంట్లపేట గ్రామానికి చెందిన మొగిలి భీమయ్యకు సీఎంఆర్ఎఫ్ చెక్కును శనివారం బీజేపీ నాయకులు మధుకర్ అందజేశారు.కార్యక్రమంలో నాయకులు మహేష్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## వైద్యులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలి

- అదనపు కలెక్టర్ డేవిడ్



బెజ్జూరులో ఆసుపత్రిని తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్ డేవిడ్

బెజ్జూరు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వైద్యులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని అదనపుకలెక్టర్ డేవిడ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని తనిఖీచేశారు. ఆసుపత్రిలో మందుల స్టాక్, స్టాఫ్ అటెండెన్స్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. ప్రజలకు మెరుగైనవైద్యం అందించాలని సూచించారు. వైద్యులు ప్రతిరోజు విధులకు హాజరవుతున్నారా అని సిబ్బంది అడిగితెలుసుకున్నారు. అనంతరం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా 34కేంద్రాలు ఏర్పాటుచేయగా ఇప్పటివరకు 6700 మెట్రిక్‌టన్నుల ధాన్యాన్ని సేకరించినట్లు ఆయన తెలిపారు. బెజ్జూరు కొనుగోలు కేంద్రంలో మందకొడిగా నడుస్తోందని రెండు మూడురోజుల్లో కొనుగోళ్లు పూర్తిచేసి ధాన్యాన్ని పంపించాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ భూమేశ్వర్, డీటీ భీమ్లానాయక్, ఆర్ఐ అచ్యుతరావు, సంతోష్, ఏపీఎం మోహన్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

**ధాన్యం కొనుగోలుకేంద్రం పరిశీలన..**

చింతలమానేపల్లి: మండలకేంద్రంతోపాటు రవీంద్రనగర్ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ డేవిడ్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన నిర్వాహకులకు, రైతులకు పలు సూచనలు, సలహాలు చేశారు. ధాన్యం విక్రయించిన రైతుల వివరాలను ట్యాబ్‌లో వెంటనే నమోదు చేయాలని, వర్షంలో ధాన్యం తడవకుండా చూడాలని సూచించారు. ఎంత ధాన్యం కేంద్రానికి వచ్చిందని ఆరా తీశారు. ఆయన వెంట ఆర్ఐ విజయ్‌కుమార్, బీసీఏవో రబ్బానీ, సహకార సంఘం సిబ్బంది తాజీంహుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ ఎదుట గ్రామ పంచాయతీ ఉద్యోగుల ధర్నా




కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న జీపీ కార్మికులు

ఆసిఫాబాద్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రెండు రోజులుగా చేపడుతున్న టోకెన్ సమ్మెలో భాగంగా శనివారం కలెక్టరేట్ ఎదుట గ్రామ పంచాయతీ ఉద్యోగులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కరించనట్లయితే జనవరి4 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని అన్నారు. వెంటనే తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రాజేందర్, కృష్ణమాచారి, కార్మికులు మోరేశ్వర్, నగేష్, అజీజ్, పుష్పలత, శంకర్, పద్మారావ్, రాణి, పొద్దు తదితరులు పాల్గొన్నారు.

## 19వ రోజుకు చేరిన ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగుల సమ్మె

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సమగ్రశిక్షా ఉద్యోగులు కలెక్టరేట్ ఎదుట చేపడుతున్న దీక్షలు శనివారం నాటికి 19వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో ఉద్యోగులు శృతిక, మోహన్, తుకారాం, నాగేష్, సంతోష్, పవన్‌కుమార్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులు

## విధుల పట్ల నిబద్ధతతో వ్యవహరించాలి



నియామక పత్రాలు అందజేస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): నూతనంగా ఎంపికైన గ్రూపు-4 అభ్యర్థులు తమ విధులపట్ల నిబద్ధతో వ్యవహరించాలని కలెక్టర్ వెంకటేష్‌దోత్రే అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లాలో రెవెన్యూవిభాగంలో ఎంపికైన 36మంది గ్రూపు-4అభ్యర్థులకు నియామకపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగం ఎంతో బాధ్యతతో కూడుకున్నదని నిబద్ధతగా వ్యవహరించి జిల్లా అభివృద్ధిలో భాగస్వామ్యులు కావాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డేవిడ్, ఆర్డీవో లోకేశ్వర్‌రావు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్మికుల రాస్తారోకో

రెబ్బెన, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రెబ్బెనలో శనివారం పంచాయతీకార్మికులు తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ప్రధానరహదారిపై రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి బోగే ఉపేందర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు చెల్లించాల్సి ఉండగా ఇంతవరకు చెల్లించటం లేదన్నారు. 2వ పీఆర్సీ పరిధిలోకి గ్రామ పంచాయతీ సిబ్బందిని తీసుకరావాలని డిమాండు చేశారు. జీవోనెం.60 ప్రకారం వేతనాలు కేటగిరిల వారిగా చెల్లించాలన్నారు. జీవోనెం.51ని వెంటనే సవరించాలని డిమాండు చేశారు. రాస్తారోకోలో జేఏసీ నాయకులు సుధాకర్, రమేష్, వెంకటేష్, శంకర్, శ్రీనివాస్, కొండక్క, రాజమ్మ తదితరులు పాల్గొన్నారు.



రాస్తారోకో చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు




## కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి: ఏఐటీయూసీ

రెబ్బెన, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు ఏఐటీయూసీ కృషి చేస్తోందని ఆ సంఘం ప్రధానకార్యదర్శి రాజ్‌కుమార్, బ్రాంచ్‌కార్యదర్శి ఎస్ తిరుపతి తెలిపారు. శనివారం బెల్లంపల్లి ఏరియాలోని వివిధ విభాగాల కార్మికులతో వారు మాట్లాడారు. సింగరేణి యాజమాన్యంతో కొద్దిరోజుల క్రితం జరిగిన స్ట్రక్చర్ సమావేశంలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలన్నింటిని యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు. డిప్యూటి జనరల్ సెక్రెటరీ సమ్మయ్య మాట్లాడుతూ కార్మికులకు సొంతింటి పథకం అమలుకు కృషి చేయనున్నట్టు తెలిపారు. సమావేశంలో నాయకులు బయ్య మొగిలి, శేషు, శేనారావు, జగ్గయ్య, జూపాక రాజేష్, కిరణ్‌బాబు, ఆనంద్, దేవరకొండ దివాకర్, తదితరులు పాల్గొన్నారు.

## పైరవీలకే పరిమితమైన గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు

మందమర్రిటౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో గుర్తింపు కార్మికసంఘం ఏఐటీయూసీ, ప్రతిపక్షయూనియన్ ఐఎన్‌టీయూసీలు పైరవీలకే పరిమతమయ్యాయని హెచ్‌ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు జె శ్రీనివాస్, హెచ్‌ఎంఎస్ కేంద్రకమిటీ ఉపాధ్యక్షుడు పార్వతి రాజిరెడ్డి విమర్శించారు. శనివారం హెచ్‌ఎంఎస్ కార్యాలయంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వాలు సంస్థకు 35వేల కోట్ల రూపాయలు ఇవ్వాల్సి ఉన్నా వీటిని అడిగే ధైర్యం కార్మికసంఘాలకు లేదన్నారు. కార్మికులకు వేల రూపాయలు ఇన్‌కంట్యాక్స్ కోత పడుతున్నా గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు పట్టించుకోవడం లేదన్నారు. త్వరలోనే తమ యూనియన్ ఆధ్వర్యంలో గనులు, డిపార్టుమెంట్లలో సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేపడతామన్నారు. సమావేశంలో నాయకులు వెల్ది సుదర్శన్, శ్రీనివాస్‌రెడ్డి, అశోక్ కుమార్, అజయ్, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

## రిటైర్డు కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

మందమర్రిటౌన్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యలను పరిష్కరించాలని రిటైర్డు కార్మికసంఘం అధ్యక్షుడు వాసాల శంకర్ అన్నారు. శనివారం సింగరేణి పాఠశాల మైదానంలో రిటైర్డు కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 11వ వేజ్ బోర్డు పింఛన్ అమలు చేయాలని, ఏరియర్స్ చెల్లించాలని కోరారు. రిటైర్డు కార్మికులకు ఖాళీగా ఉన్న క్వార్టర్లను ఇవ్వాలని తదితరడిమాండ్స్ చేశారు. సమస్యల పరిష్కారానికి గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలకు వినతిపత్రాలుఇస్తామని, త్వరలోనే మందమర్రిలో సభ నిర్వహిస్తామన్నారు.

## ఉమ్మడి జిల్లా తెలంగాణ ఉద్యమకారుల చరిత్ర రాయాలి

కరీంనగర్ కల్చరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కరీంనగర్ జిల్లా తెలంగాణ ఉద్యమకారుల చరిత్ర రాయాలని జిల్లా ఉద్యమకారులఫోరం రాష్ట్ర సలహాదారు, ఆహార భద్రత కమిటీ సభ్యుడు ఓరుగంటి ఆనంద్ అన్నారు. శనివారం కరీంనగర్‌లో ఉమ్మడిజిల్లా కవులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖమంత్రి పొన్నం ప్రభాకర్ జీవిత చరిత్ర రాయాలని కోరారు. త్వరలో ఉమ్మడి కరీంనగర్‌జిల్లా ఉద్యమకారుల డైరీని ముద్రిస్తామని అన్నారు. అనంతరం కవులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఫోరంజిల్లాఅధ్యక్షులు కనకం కుమారస్వామి, అయిలోని ప్రసన్న, బోగె పద్మ రవీందర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ జోగిరెడ్డి, కవులు, ఉద్యమకారులు పాల్గొన్నారు.

# పెరుగుతున్న నేరాలు

5వ పేజీ తరువాయి


జిల్లా కేంద్రంలో పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకున్న పోలీసులు (ఫైల్)

పెట్టుబడి పెట్టి నష్టపోయాడు. దీనికితోడు ఆన్‌లైన్ లోన్ యాప్‌లలో అప్పు తీసుకున్నాడు. ఆర్థికంగా ఇబ్బందులు తలెత్తడంతో భార్య, ఇద్దరు కుమారులకు విషంఇచ్చి అనంతరం ఆత్మహత్య చేసుకున్నాడు.

- కాసిపేట గ్రామానికి చెందిన సముద్రాల మొండయ్య, శ్రీదేవి దంపతులతోపాటు వారి కుమారుడు శివప్రసాద్, కూతురు శ్రీ చైతన్యలు క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. శివప్రసాద్ ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిసై చేసిన అప్పులు తీర్చే మార్గం కానరాక ఈ నెల 9న కుటుంబ సభ్యులతో కలిసి ఆత్మహత్యకు పాల్పడ్డారు.
- ఇంటర్‌లో ఫెయిల్ కావడంతో ఇద్దరు విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్న సంఘటన తాండూరు మండలంలో చోటుచేసుకుంది. అచలాపూర్ గ్రామానికి చెందిన షైదం సాత్విక్ బెల్లంపల్లి ప్రైవేట్ కాలేజీలో ఎంపీసీ ఫస్ట్ ఇయర్ చదువుతున్నాడు. ఫెయిల్ కావడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని తనువు చాలించాడు.
- జిల్లా కేంద్రానికి చెందిన తేజస్విని ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతోంది. మ్యాథ్స్ సబ్జెక్టులో ఫెయిల్ కావడంతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది.
- జిల్లా కేంద్రానికి చెందిన 7వ తరగతి బాలిక చదువులో వెనకబడ్డాననే మనస్తాపంతో ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది.
- కిష్టంపేటకు చెందిన ఊరడి సత్యనారాయణ ఈ నెల 25న ఆర్థిక ఇబ్బందులతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

### పోలీసుల కూంబింగ్... తనిఖీలు

జిల్లాలో పోలీసుల కూంబింగ్, తనిఖీలు ముమ్మరంగా చేపట్టారు. కోటపల్లి వద్ద అంతర్ జిల్లా చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. ఇంటర్ డిస్ట్రిక్ట్ బార్డర్‌లో భాగంగా భూపాలపల్లి, కరీంనగర్, ఆసిఫాబాద్‌లు ఉన్నాయి. ప్రాణహిత సరిహద్దు పాయింట్లు ఉన్నాయి. సికాస కార్యకలాపాలు ఊపందుకునే అవకాశాలు ఉండటంతో పూర్తిస్థాయిలో దృష్టి సారిస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మావోయిస్టులపై ప్రత్యేక నిఘా పెట్టారు. ఎస్టీపీపీ సమావేశ మందిరంలో అంతర్రాష్ట్ర, జిల్లా సరిహద్దు పోలీసు అధికారుల సమావేశం ఏర్పాటుచేసి మార్గనిర్దేశం చేశారు.

### విచ్చలవిడిగా జూదం...

జిల్లాలో విచ్చలవిడిగా జూదం కొనసాగుతోంది. మారుమూల గ్రామాలు, మామిడి తోటలు, లాడ్జీల్లో జూదం నిర్వహిస్తూ లక్షల రూపాయలు చేతులు మారుతున్నట్లు సమాచారం. గోదావరిఖనితో పాటు ఇతర ప్రాంతాల నుంచి పేకాట కోసం మంచిర్యాలకు వస్తుండటం గమనార్హం. గ్రామ శివారుల్లోని అటవీ ప్రాంతంలో నిత్యం మూడు ముక్కలాట జోరుగా సాగుతున్నట్లు సమాచారం. జిల్లాలో మట్కా నిర్వహణ కూడా తెరపైకి వచ్చింది. జన్నారం, మంచిర్యాల, బెల్లంపల్లి, శ్రీరాంపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మట్కా నిర్వహిస్తున్నారనే పక్కా సమారంతో దాడులు నిర్వహించారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధి టాస్క్‌ఫోర్స్, స్థానిక పోలీసులు 10 బృందాలుగా ఏర్పడి ఏకకాలంలో దాడులు నిర్వహించి 27 మందిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ. 2.46 లక్షల నగదు, 18 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా కేంద్రంలోని ఓ లాడ్జిలో మట్కా ఆడుతున్న పలువురిని పోలీసులు అరెస్టు చేయగా, లాడ్జి నిర్వాహకులపై కేసు కూడా నమోదైంది. మరోవైపు మట్కా నిర్వాహకులతో సన్నిహిత సంబంధాలు కలిగి, విధుల్లో ఉదాసీనత ప్రదర్శించిన ఎనిమిది మంది పోలీసులను హెడ్‌క్వార్టర్‌కు అటాచ్ చేశారు. వ్యభిచారం కూడా జిల్లాలో పెద్ద ఎత్తున జరుగుతోంది. మూడు నెలల క్రితం బెల్లంపల్లి చౌరస్తా సమీపంలోని ఓ లాడ్జితో పాటు జన్మభూమినగర్‌లోని ఓ గెస్ట్ హౌజ్‌లో వ్యభిచారం చేస్తూ పోలీసులకు పట్టుబడ్డారు. దీంతో ఆ రెండు అడ్డాలను సీజ్ చేశారు.

### జోరుగా నిషేధిత విత్తనాల సరఫరా...

ప్రభుత్వం నిషేధించిన బీటీ-3 పత్తి విత్తనాల సరఫరా తాజాగా జిల్లాలో వెలుగు చూసింది. ఏప్రిల్ 22న కర్ణాటకలోని కొప్పల్ జిల్లా నుంచి మంచిర్యాల జిల్లా మందమర్రికి నిషేధిత బీటీ-3 విత్తనాలను తరలిస్తుండగా మేడ్చల్ పోలీసులు పట్టుకున్నారు. డీసీఎం వ్యాన్‌లో ఉల్లిగడ్డ బస్తాల మాటున నకిలీ విత్తనాలను తరలిస్తూ నిందితులు పోలీసులకు చిక్కారు. నిందితుల నుంచి రూ. 35 లక్షల విలువైన 1.2 టన్నుల బీటీ-3 పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. గతంలోనూ నిందితులు ఇదే తరహాలో పత్తి విత్తనాలు తీసుకొచ్చినట్లు దర్యాప్తులో వెల్లడైంది.

# కూరగాయల జ్యూస్‌కు డిమాండ్

- వెలుస్తున్న వెజిటబుల్ జ్యూస్ సెంటర్లు
- ఆసక్తి చూపుతున్న ప్రజలు


సోరకాయ జ్యూస్ తయారు చేస్తున్న జ్యూస్ సెంటర్ నిర్వాహకుడు

నయా ట్రెండ్

బెల్లంపల్లి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కూరగాయలను ఆహారంలో కూరల రూపంలో తీసుకునేవాళ్లం... అలాగే ఆరోగ్యం కోసం వివిధ రకాల పండ్లు, పండ్ల రసాలను వినియోగించే వాళ్లం. ప్రస్తుతం కూరగాయలతో చేసిన జ్యూస్‌ల వినియోగం పెరిగింది. పండ్ల రసాలు అమ్మే జ్యూస్ సెంటర్లలోనే కాకుండా ప్రత్యేకంగా వెజిటబుల్ జ్యూస్ సెంటర్లు వెలుస్తున్నాయి.


జ్యూస్ తాగుతున్న చిన్నారులు

### కూరగాయల జ్యూస్‌లపై ఆసక్తి

కూరగాయలతో తయారు చేసిన జ్యూస్‌లు ఆరోగ్యానికి మేలు చేస్తాయని వైద్యులు సూచిస్తుండడంతో దీనిపై ఆసక్తి చూపుతున్నారు. ఆయా జ్యూస్ సెంటర్లలో బూడిదగుమ్మడికాయ, సోరకాయ, కాకరకాయ, కీరదోసకాయ, క్యారెట్, బీట్‌రూట్, జామకాయ జ్యూస్‌లను తయారు చేస్తున్నారు. వీటితో పాటు వివిధ రకాల పండ్ల జ్యూస్‌లను సైతం అందుబాటులో ఉంచుతున్నారు. ప్రజల్లో ఆరోగ్యంపై శ్రద్ధ పెరగడంతో జ్యూస్‌లపై ఆసక్తి చూపుతున్నారు. అంతేకాకుండా చిరు, తృణధాన్యాలతో చేసిన అల్పాహారానికి సైతం మార్కెట్‌లో గిరాకీ పెరిగింది. చాలా మంది మిల్లెట్ ఇడ్లీ, మిల్లెట్ దోశ, తృణ ధాన్యాలతో చేసిన అల్పాహారాలను తీసుకుంటున్నారు.





### జ్యూస్‌ల అమ్మకాలు బాగా పెరిగాయి

**పీవీ రావు, జ్యూస్ సెంటర్ నిర్వహకుడు, మంచిర్యాల**



జ్యూస్‌లపై ప్రజలకు ఆసక్తి పెరగడంతో గిరాకీ బాగా ఉంటుంది. మొదట్లో పండ్ల రసాలు మాత్రమే అమ్మే వాళ్లం. వెజిటబుల్ జ్యూస్‌లు అడుగుతుండడంతో వివిధ రకాల కూరగాయల జ్యూస్‌లను సైతం అందుబాటులో ఉంచుతున్నాం. గతంలో వేసవిలో మాత్రమే జ్యూస్‌లు తాగేవారు. ఇప్పుడు ప్రజల్లో ఆరోగ్య స్పృహ పెరగడంతో కాలాలతో సంబంధం లేకుండా జ్యూస్‌లు సేవిస్తున్నారు.

### జ్యూస్‌లు తాగడం ద్వారా ఆరోగ్యం బాగుంటుంది



పండ్ల రసాలతో పాటు కూరగాయల జ్యూస్‌లు తాగడం వల్ల ఆరోగ్యం బాగుంటుంది. అనారోగ్యం వచ్చిన సమయంలోనే కాకుండా రోజు జ్యూస్ తాగుతాను. ఇంట్లోని చిన్న పిల్లలకు సైతం జ్యూస్‌లు తాగిస్తుంటాను. జ్యూస్‌లలో అన్ని రకాల విటమిన్‌లు పుష్కలంగా ఉండడం, ఆరోగ్యానికి ఎంతో మంచిదని వైద్యులు సూచిస్తున్నారు.

## వాకింగ్ ట్రాక్, జిమ్ ఏర్పాటుకు కృషి


వాకర్ అసోసియేషన్ అధ్యక్షుడు బండి సదానందంను సన్మానిస్తున్న వాకర్లు

మందమర్రిటౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వాకర్లకు వాకింగ్ ట్రాక్‌తో పాటు ఓపెన్ జిమ్ ఏర్పాటుకు కృషి చేస్తానని పాత బస్టాండ్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బండి సదానందం యాదవ్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఊరు మందమర్రి మిని ట్యాంక్ బండ్ వద్ద రోజు ఉదయం, సాయంత్రం వాకింగ్ చేస్తున్నారని తెలిపారు. జిమ్‌ను ఏర్పాటు, వాకింగ్ ట్రాక్ సక్రమంగా లేదని, దీన్ని కూడా బాగు చేయాలని కోరారు. రెండు రోజుల క్రితం వాకర్స్ సమావేశం జరిగిందని, ఇందులో చర్చించిన అంశాలను ఎంపీ వంశీకృష్ణ, ఎమ్మెల్యే వివేక్‌ల దృష్టికి తీసుకువెళ్తానని తెలిపారు. అనంతరం వాకర్లు ఆయనను సన్మానించారు ప్రధాన కార్యదర్శి మేకల రాజన్న, కోశాధికారి అంజయ్యచారి, ఉపాధ్యక్షులు తిరుపతి, నరహరి, దుర్గయ్య, రాంరెడ్డి, సత్యనరాయణ, బుచ్చన్న, సత్యం, రమేష్, రాములు పాల్గొన్నారు.

### అభివృద్ధి గ్రామసభలు

తాండూర్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : కొత్తపల్లి, మాదారం, తాండూర్, గోపాల్‌నగర్, అచ్చలాపూర్ గ్రామాల్లో 2025-26 సంవత్సరానికిగాను గ్రామపంచాయతీ డెవలప్‌మెంట్ ప్లాన్ గ్రామ సభలను శనివారం నిర్వహించారు. సభల్లో అభివృద్ధి పనులు, గ్రామంలోని సమస్యలు, రోడ్లు, కాలువల నిర్మాణ పనులపై చర్చించారు. ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో అనిల్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు, ప్రజలు పాల్గొన్నారు.

## టీఎన్‌జీవో సభ్యత్వ నమోదు


తహసీల్దార్ కార్యాలయంలోని ఉద్యోగులకు సభ్యత్వం అందజేస్తున్న టీఎన్‌జీవో నాయకులు

గర్మిళ్ల, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాలలోని తహసీల్దార్ కార్యాలయంలో శనివారం టీఎన్‌జీవో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి కార్యాలయంలోని నాన్ గెజిటెడ్ ఉద్యోగులకు సభ్యత్వం అందజేశారు. జిల్లా కార్యదర్శి రామ్మోహన్, నాయకులు మల్లయ్య, బాపురావు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న టోర్నమెంట్


క్రీడాకారులతో నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రఘునాథ్ వెరబెల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అటల్ బీహారి వాజ్‌పేయి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ కొనసాగుతోంది. నాలుగో రోజు శనివారం మంచిర్యాల పట్టణాధ్యక్షుడు వంగపల్లి వెంకటేశ్వర్‌రావు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ముకేష్‌గౌడ్‌లు టాస్ వేసి మ్యాచ్‌ను ప్రారంభించారు. నాయకులు జయరాంరావు, మురళీధర్, నవీన్, సరస్వతి, తరుణ్‌సింగ్, శ్రీనివాస్, సత్యనారాయణ, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## న్యూస్ బాక్స్

### కళాకారుల ఎంపిక

జన్నారం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పీఆర్‌టీయూ భవన్‌లో వరంగల్ శ్రీనివాస్ రాసిన ఓయమ్మ నా పల్లె సీమ అనే పాటను పాడించడానికి కళాకారులను శనివారం ఎంపిక చేశారు. ధూంధాం వ్యవస్థాపకుడు అంతడుపుల నాగరాజు అధ్యక్షత వహించగా వరంగల్ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నలుమూలల నుంచి హాజరైన కళాకారులు పాటలు పాడగా పలువురిని ఎంపిక చేశారు. గేయ రచయిత శ్రీనివాస్‌ను కట్ట రాజమౌళి, జక్కు భూమేష్‌లు సన్మానించారు. సంగీత దర్శకుడు మల్లిక్ తేజ, జూపాక శ్రీను, ఉప్పులేటి నరేష్, కొండు జనార్దన్, రాజలింగు, మురళీ,రమేష్ పాల్గొన్నారు.

### అయ్యప్ప ఆలయంలో పూజలు

బెల్లంపల్లి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో శనివారం లక్ష మంత్రార్చన పారాయణం చేశారు. అనంతరం తీర్థ ప్రసాదాలను అందజేశారు. పండితులు కుటుంబరావు, అనిల్, కోటేశ్వర్‌రావు, స్వాములు సత్యం, రఘు, అనుదీప్, సాయి, రాజు, రాజేష్ పాల్గొన్నారు.

### ఆర్థిక సహాయం

జన్నారం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతగూడ గ్రామానికి చెందిన సంపంగి లక్ష్మీ కూతురు వివాహానికి రోటిగూడ గ్రామానికి చెందిన ఉప్పు సురేష్, ఆరే యుగేందర్‌లు శనివారం రూ.5 వేల ఆర్థిక సహాయం అందించారు. నిరుపేద కుటుంబం కావడంతో సహాయం చేసినట్లు తెలిపారు.

### దుప్పట్లు పంపిణీ

జన్నారం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పొనకల్ గ్రామంలోని వృద్ధులకు మాజీ జెడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్ దుప్పట్లు పంపిణీ చేశారు. తీవ్రమైన చలి కారణంగా వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారని గ్రహించి దుప్పట్లు అందించామన్నారు. రాఘవేంద్ర కరిమల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మణ్, మాజీ వార్డు సభ్యులు శ్రీకాంత్, రాజ్‌కుమార్, శంకర్, రాఘవేంద్ర విద్యాసంస్థల అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### చెరువు పరిశీలన

దండేపల్లి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): నాగసముద్రంలో గ్రామ చెరువును శనివారం అధికారులు పరిశీలించారు. కబ్జా నుంచి కాపాడాలని స్థానికులు ఫిర్యాదు మేరకు ఈఈ రాము, డీఈ కుమార్ స్థానికులతో కలిసి సందర్శించారు. ఈఈ రాము మాట్లాడుతూ సర్వే చేయించిన అనంతరం పూర్తి వివరాలను వెల్లడిస్తామన్నారు.

### రైతుల ఖాతాల్లో నగదు జమ

మంచిర్యాల కలెక్టరేట్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో319 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 76కోట్ల36 లక్షల నగదును సంబంధిత రైతుల ఖాతాల్లో జమ చేశామని అదనపు కలెక్టర్ మోతిలాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు 64,126 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి 5,259 మంది రైతుల ఖాతాల్లో 76కోట్ల36 లక్షలు జమ చేశామన్నారు. 104 కేంద్రాల్లో కొనుగోలు లక్ష్యం పూర్తి చేసి మూసివేశామన్నారు.

## విద్యార్థులకు క్రీడా పోటీలు



గెలుపొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

హాజీపూర్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : హాజీపూర్ మండలంలోని మౌంట్ కార్మెల్ హైస్కూల్‌లో శనివారం విద్యార్థులకు వార్షిక ఆటల పోటీలను నిర్వహించారు. రన్నింగ్ 200, 400, 600, 800 మీటర్లు నిర్వహించారు. బాలికల సీనియర్ విభాగంలో త్రోబాల్, కబడ్డీ పోటీలను నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. ప్రధానోపాధ్యారాలు సిస్టర్ ఆల్ఫీ, వ్యాయామ ఉపాధ్యాయుడు నరేంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## స్నేహితుడి వైద్యం కోసం ఆర్థికసాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న మిత్రులు

దండేపల్లి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): రంగంపల్లి గ్రామానికి చెందిన అల్లంల ప్రభాకర్‌కు కన్నెపల్లిలో ప్రధాన రహదారిపై టిప్పర్ ఢీకొట్టడంతో తలకు గాయమై, కాలు విరిగింది. వీరిది నిరుపేద కుటుంబం కావడంతో విషయం తెలుసుకున్న రెబ్బనపల్లి ఉన్నత పాఠశాలలో 2005-06 పదో తరగతి బ్యాచ్ బాల్య మిత్రులు రూ.13వేల జమ చేసి కరీంనగర్‌లో ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మిత్రుడిని పరామర్శించి శనివారం అందజేశారు.










## విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

ఆసిఫాబాద్ రూరల్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నతశిఖరాలను అధిరోహించాలని జిల్లాబాలల సంరక్షణాధికారి బి మహేష్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సాంఘికసంక్షేమ బాలురగురుకుల పాఠశాలలో పిల్లలసమగ్ర అభివృద్ధి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కష్టపడి చదువుకొని ఉన్నతశిఖరాలనుఅధిరోహించి కుటుంబానికి, పాఠశాలలకు గుర్తింపు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది చంద్ర శేఖర్, ప్రవీణ్, వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్‌యాదగిరి, ఉపాధ్యాయులు సంతోష్, సునీల్, శంకర్, పాల్గొన్నారు.

## దుప్పట్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు



దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ మండలంలోని సముతుల గుండం గ్రామంలోని నిరుపేద కొలాం ఆదివాసీలకు శనివారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్, ఆయన సతీమణి ద్రుపద దుప్పట్లు, నూతన వస్త్రాలను పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేద ఆదివాసీ కొలాం గిరిజనులు చలి నుంచి రక్షించుకునేందుకు దుప్పట్లతోపాటు నూతనవస్త్రాలను అందించామన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ సంఘాల నాయకులు భీంరావు, వినోద్, గ్రామస్థులు పాల్గొన్నారు.

## డబుల్ బెడ్రూం ఇళ్లను త్వరగా పూర్తిచేయాలి



వివరాలను తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

కాగజ్‌నగర్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేయాలని అదనపుకలెక్టర్ దీపక్‌తివారి అన్నారు. శనివారం మున్సిపల్‌పరిధిలో చేపట్టిన రెండుపడక గదుల ఇండ్ల నిర్మాణపనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండు పడక గదుల ఇండ్ల నిర్మాణం పనుల్లో పెండింగ్ ఉన్న పనులపై దృష్టిసారించి త్వరగా పూర్తి చేయాలన్నారు. సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల కోసం అందిన దరఖాస్తులకు సంబంధించి స్పష్టంగా వివరాలను నమోదు చేయాలన్నారు. నిర్ణీత గడువులోగా సర్వే పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్, ఎంపీడీవో రమేష్, ఆయాశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ నిలుపుదలకు కృషిచేస్తా



మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

సిర్పూర్(టి), డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): సిర్పూర్(టి) రైల్వేస్టేషన్‌లో భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ రైలు హాల్టింగ్‌కు కృషిచేస్తానని బీఆర్ఎస్ రాష్ట్రనాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని బస్టాండుఏరియాలో నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. పలు వురు గ్రామస్థులు భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ రైలు ఇక్కడ నిలిపేలా కృషిచేయాలని కోరగా స్పందించిన ఆయన రైల్వే అధికారులతో మాట్లాడి భాగ్యనగర్ రైలు నిలిపేలా కృషి చేస్తానని అన్నారు. ఆయన వెంట నాయకులు అస్లాంబీన్ అబ్దుల్లా, షేక్‌చాంద్ తదితరులు ఉన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించిన డీపీవో



కెరమెరిలో సర్వేను పరిశీలిస్తున్న డీపీవో భిక్షపతిగౌడ్

కెరమెరి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతో పాటు మండంలోని ఆయా గ్రామాల్లో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను శనివారం జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతిగౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యాప్‌ప్రకారం ఇందిరమ్మ ఇంటింటి సర్వే వివరాలు యాప్‌లో పొందుపర్చాలని సూచించారు. మండలపరిషత్ కార్యాలయంలో జరుగుతున్న ఆన్‌లైన్ వివరాల నమోదు ఎంతశాతం పూర్తయిందని అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి తప్పులు దొర్లకుండా ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో అంజద్‌పాషా, కార్యదర్శి గణేష్ ఉన్నారు.

**ఇందిరమ్మ ఇళ్ల సర్వే పునఃపరిశీలన**

**వాంకిడి:** మండలంలోని సరండి, బెండార గ్రామపంచాయతీల్లో పంచాయతీ కార్యదర్శుల ద్వారా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే వివరాలను శనివారం ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ పునఃపరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యదర్శులు ఆన్‌లైన్ చేసిన వివరాలను తన దగ్గర ఉన్న వివరాలతో పోల్చి చూసి తన లాగిన్ ద్వారా అప్‌లోడ్ చేశారు. అనంతరం నర్సరీలను పరిశీలించారు. ఆయన వెంట ఏపీవో శ్రావణ్‌కుమార్, కార్యదర్శులు ఉన్నారు.

## ప్రభుత్వ వైద్య వ్యవస్థను గాడిలో పెట్టాలి: ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీష్ బాబు

కాగజ్‌నగర్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): సిర్పూరు ఎమ్మెల్యే హరీష్‌బాబును హైదరాబాద్‌లో శనివారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జాతీయ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే హరీష్‌బాబు మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య వ్యవస్థను గాడిలో పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

## జైనూరు మార్కెట్ కమిటీ చైర్మన్‌కు సన్మానం

జైనూర్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): జైనూర్ మార్కెట్‌కమిటీ కార్యాలయంలో బీజేపీ నాయకులు కేంద్రే సుబోద్, మేస్రాం దౌలత్‌రావ్ తదితరులు మార్కెట్‌కమిటీ చైర్మన్ కుడిమెత విశ్వనాథ్, డైరెక్టర్లు పంద్ర షేకు, మండాడి లింగు, తదితరులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కుడిమెతవిశ్వనాథ్ మాట్లాడుతూ జైనూర్‌మార్కెట్ పరిధిలోని రైతులకు పూర్తిస్థాయిలో న్యాయం చేసేందుకు చర్యలు తీసు కుంటామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు అబ్దుల్ ముకీద్, ఉపాధ్యక్షుడు పెందుర్ ప్రకాష్, నాయకులు పాల్గొన్నారు.

## ఆయుష్మాన్ 'యోగా'



బెజ్జూరులో యోగా చేస్తున్న యువకులు

- జిల్లాలో 9కేంద్రాలు ఏర్పాటు
- యోగాతో సంపూర్ణ ఆరోగ్యం
- గ్రామాల్లో సద్వినియోగం చేసుకుంటున్న యువత

బెజ్జూరు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత జీవన విధానంలో అనేక మార్పులు రావడంతో పాటు అనారోగ్య సమస్యలు కూడా తోడవుతున్నాయి. ఆహారపు అలవాట్లు, తినే తిండిలో విపరీతంగా కల్తీ పెరిగి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. సాంకేతిక రంగంలో అనేక మార్పులు రావడంతో సరైన తిండి, నిద్ర లేక, కంప్యూటర్ల ముందు గంటల తరబడి కూర్చోవడం ఇలా ప్రతి ఒక్కరి జీవనశైలి మారిపోయింది. దీనితో మనిషి రోగాల కుప్పగా మారుతున్నాడు. వీటన్నింటికి ప్రధానకారణం మనిషికి సరైన వ్యాయామం లేకపోవడమేనని నిపుణులు పేర్కొంటున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వమే గ్రామాల్లో ఆయుష్ ఆరోగ్య యోగా కేంద్రాలను ప్రారంభించింది.

**● ఎక్కడెక్కడంటే..**

జిల్లాలోని ప్రభుత్వ ఆయుర్వేద, హోమియో, యునాని ఆరోగ్యకేంద్రాల్లో ఆయుష్ ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేసి యోగా శిక్షణ ఇస్తున్నారు. జిల్లాలోని బెజ్జూరు, గురుడుపేట, బీబ్రా, చిర్రకుంట, కెరమెరి, వాంకిడి, పంగిడి, కాగజ్‌నగర్, సిర్పూర్(టి) గ్రామాల్లో ఆరోగ్యకేంద్రాల్లో ఏర్పాటు చేసిన యోగా కేంద్రాలు కొనసాగుతున్నాయి. ముఖ్యంగా గతంలో గ్రామీణ ప్రాంతాల్లో యోగా కేంద్రాలు, శిక్షకులు లేక ఆరోగ్యంపట్ల అవగాహన లేకుండా పోయింది. కేంద్రం ఈ పథకం ఏర్పాటు చేసిన పక్షంలో గ్రామీణ యువతసైతం ప్రతిరోజు యోగాకేంద్రాల్లో శిక్షణ తీసుకుంటూ ఆరోగ్యంపై శ్రద్ధ చూపెడుతున్నారు.

**● యోగాతో ప్రశాంతత, ఆధ్యాత్మికత..**

నిత్యం యోగాసనాలు, ధ్యానం చేయడంతో శరీరంలో ప్రతికూల ప్రభావం తొలగి ప్రశాంతత, ఆధ్యాత్మికత చేకూరుతుందనేది నిరూపిత సత్యం. నిత్యం యోగాతో రోగ నిరోధకశక్తి పెరుగుతుంది. ఆసనాలు, ప్రాణాయామాలు, ధ్యానం మనిషిని శక్తివంతం చేయడంతోపాటు సన్మార్గంలో నడిచేందుకు దోహదపడతాయి. ఆరోగ్య జీవనానికి దోహదపడే యోగాను ప్రజలకు నేర్పించేందుకు జిల్లాలోని ఆయుష్ ఆరోగ్యమందిరాల్లో ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఔత్సాహికులు ఉదయం, సాయంత్రం ఉచితంగా శిక్షణ పొందుతూ తేలికపాటి ఆసనాలు నేర్చుకుంటున్నారు.

**● ఉదయం సాయంత్రం గంటపాటు..**

ప్రజల ఆరోగ్య సంరక్షణకు కేంద్రప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ పథకాన్ని ప్రారంభించింది. రూ.5లక్షల వరకు ఉచితవైద్యం అందించేందుకు ఏర్పాటు చేసింది. వైద్యం వరకు వెళ్లకుండా మానసిక, శారీరకంగా ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దాలని ఆయుష్ ఆరోగ్య మందిరాల్లో యోగా కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్ర ఆయుష్‌శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని ఆయుష్‌విభాగం కేంద్రాలను ఏర్పాటు చేసి యోగా నేర్పిస్తున్నారు. జిల్లాలో 9కేంద్రాల్లో ఉదయం, సాయంత్రం గంటపాటు యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఏడాదిపాటు బృందాల వారీగా యోగాసనాలు నేర్పించనున్నారు.

**సద్వినియోగం చేసుకోవాలి..**
**- సందీప్‌కుమార్, జిల్లా ప్రోగ్రాం అధికారి**

మారుమూల గ్రామాలకు యోగా చేరువ చేయాలనే ఉద్దేశంతో ఆయుష్‌శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో 9కేంద్రాల్లో యోగా తరగతులు కొనసాగుతున్నాయి. ఒక్కో కేంద్రంలో ఇద్దరు శిక్షకులను నియమించి ఆసనాలు చేయిస్తున్నాం. జిల్లాలోని ప్రజలు యోగా నేర్చుకుంటూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆరోగ్యవంతులుగా ఉండాలి.

**యోగా దివ్య ఔషదం..**
**- రాచకొండ నాగేష్, బెజ్జూరు**



మనుసుకు ప్రశాంతత, సంపూర్ణ ఆరోగ్యానికి యోగా దివ్య ఔషదంగా పనిచేస్తుంది. మెదడుకు పదును పెట్టడానికి యోగాభ్యాసం ఎంతో ఉపకరిస్తుంది. నేటితరం మొబైల్‌ఫోన్లు, కంప్యూటర్ల ముందు ఎక్కువ సమయాన్ని గడుపుతున్నారు. దీంతో అనేక మానసిక, శారీరక సమస్యలు ఎదురవుతున్నాయి. ఎంత ఒత్తిడి ఉన్నా ఉదయం గంటపాటు యోగా చేస్తే రోజంతా ఉత్సాహంగా గడుపవచ్చు.

## ప్రజలు జాగ్రత్తగా ఉండాలి

సిర్పూర్(టి), డిసెంబరు 28(ఆంధ్ర జ్యోతి): సిర్పూర్(టి) రేంజ్‌పరిధిలోని గ్రామాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఎఫ్ ఆర్వో ఇక్బాల్‌హుస్సేన్ అన్నారు. శనివారం రేంజ్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సిర్పూర్(టి) రేంజ్‌పరిధిలోని వెంపల్లి, మెట్‌పల్లి, మాలిని, లింబుగూడ, ఇటిక్యాలపహాడ్ గ్రామాలతోపాటు మహారాష్ట్రలోని అంతర్ గాం సమీపంలో పులి ఆనవాళ్లను గుర్తించామన్నారు. వ్యవసాయపనులకు వెళ్లేవారు ఒంటరిగా కాకుండా గుంపులుగా వెళ్లాలన్నారు. పులికి ఎవరూ హాని కలిగించవద్దని, హానికలిగిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. పులిసంచారంపై అటవీశాఖ సిబ్బంది నిఘా పెట్టిందన్నారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

రెబ్బెన, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్సై చంద్రశేఖర్ అన్నారు. శనివారం మండలంలోని పులికుంట గ్రామంలో ఏర్పా టుచేసిన కళాజాతాలో ఆయన మాట్లాడారు. బ్యాంకుకు సంబంధించిన వివరాలు ఎవరికీ చెప్పవద్దన్నారు. కార్యక్రమంలో కళాజాతా సభ్యులు రాంచందర్, రోహిత్, చంద్రశేఖర్, రజిత, సంధ్య పాల్గొన్నారు.

## పది ఫలితాలపై దృష్టి సారించాలి

కాగజ్‌నగర్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పదిఫలితాలపై ఉపాధ్యాయులు దృష్టి సారించి చక్కటి ఫలితాలు సాధించేలా చూడాలని ఎంఈవో ప్రభాకర్ అన్నారు. శనివారం మండలంలోని జీడిచేను పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు విద్యార్థుల కనీస అభ్యసన సామర్థ్యాలను పరీక్షించాలన్నారు. అలాగే టీఎల్ ఎం, గ్రంథాలయ పుస్తకాల వినియోగం, తదితర అంశాలపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ క్వాలిటీ కోఆర్డినేటర్ ఉప్పులేటి శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

## ల్యాబ్‌లను సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తా

కెరమెరి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): గిరిజన విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న డిజిటల్ ల్యాబ్‌లను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శనివారం మండలంలోని హట్టి ఆశ్రమపాఠశాలలో ఏర్పాటుచేసిన డిజిటల్ ల్యాబ్‌ను ఐటీడీఏ పీవో కుష్బుగుప్తాతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజన విద్యార్థులు.. ఉపాధ్యాయులు తరగతులలో బోధించే పాఠ్యాంశాలతోపాటు డిజిటల్ ల్యాబ్‌ల ద్వారా అర్థం కాని విషయాలను నేర్చుకుని వార్షిక పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. పాఠశాల తరగతులు ముగిసిన తరువాత విద్యార్థులు ప్రతిరోజు ఒకగంటసేపు డిజిటల్ ల్యాబ్‌లో కూర్చుని అర్థం కాని పాఠాలను వినాలన్నారు. జిల్లాలోని హట్టి, ఆసిఫాబాద్ బాలికల ఆశ్రమపాఠశాలలో డిజిటల్ ల్యాబ్‌లు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమశాఖ ఉపసంచాలకులు రమాదేవి, ఏసీఎంవో ఉద్ధవ్, జీసీడీవో శకుంతల, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

**జంగుబాయి ఉత్సవాల పోస్టర్ల విడుదల..**

కెరమెరి మండల సరిహద్దులోని ముక్దంగూడ అడవుల్లో జరిగే జంగుబాయి ఉత్సవాల పోస్టర్లను శనివారం కలెక్టర్ వెంకటేష్‌దోత్రే, ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తా ఆవిష్కరించారు. జనవరి2 నుంచి నెలరోజుల పాటు జరిగే జంగుబాయి ఉత్సవాలకు తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ నుంచి ఆరు గోత్రాల గిరిజనులు భారీగా తరలిరానున్నారు.

**చేపల పెంపకంతో అధిక ఆదాయాన్ని పొందాలి..**

**వాంకిడి:** చేపల పెంపకందారులు అధిక ఆదాయాన్ని పొందాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శనివారం మండలంలోని సరండి గ్రామంలో రైతులు ఏర్పాటు చేసిన చేపల చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామానికి చెందిన ఏడుగురు గిరిజనరైతులు సుమారు 15ఎకరాల్లో నిర్మించుకున్న చేపల చెరువును పరిశీలించారు. చేపల పెంపకంలో అధిక ఆదాయం దిశగా రైతులను ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. కార్యక్ర మంలో జిల్లా మత్స్యశాఖఅధికారి సాంబశివరావు, తహసీల్దార్ రియాజ్‌అలీ, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

**పెండింగ్ వేతనాలు చెల్లించాలి..**

**ఆసిఫాబాద్:** పెండింగ్ వేతనాలు చెల్లించాలని శనివారం కలెక్టర్ వెంకటేష్ దోత్రేకు సీఐటీయూ నాయకులతో కలిసి 104ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరు నెలలుగా వేతనాలు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. సమస్యపై రాష్ట్ర ప్రభుత్వానికి అనేక సార్లు వినతిపత్రం అందజేశామన్నారు. కార్యక్రమంలో 104 ఉద్యోగులు ప్రశాంత్, మల్లేష్, తిరుపతి, అనీల్‌కుమార్, రవి తదితరులు పాల్గొన్నారు.

## శాంతి భద్రతల పరిరక్షణకు నిరంతర కృషి

**● జిల్లాలో ఈ ఏడాది 1207కేసులు నమోదు ● వార్షిక నివేదిక విడుదల చేసిన ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు**



వార్షిక నివేదికను విడుదల చేస్తున్న ఎస్పీ శ్రీనివాస్‌రావు

ఆసిఫాబాద్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం కృషిచేస్తున్నట్లు ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు తెలిపారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాపోలీసు వార్షికనివేదిక 2024ను విడుదలచేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ జిల్లాపరిధిలో ఈఏడాది 1207కేసులు నమోదయ్యాయన్నారు. 2023లో జిల్లా పరిధిలో 1063కేసులు నమోదుకాగా ఈఏడాది 144కేసులు పెరిగాయన్నారు. ఈఏడాది జిల్లాలో 12హత్యకేసులు, 82ఆస్తి సంబంధిత నేరాలు, మూడు నేరపూరిత హత్యలు, నాలుగు దొమ్మి కేసులు, 14కిడ్నాప్ కేసులు, 24రేప్‌కేసులు, 34ఎస్సీ, ఎస్టీ కేసులు, 27పోక్సో కేసులు, 39గంజాయి కేసులు, 21సైబర్‌నేరాల కేసులు, 188మహిళలపై అఘాయిత్యాలకు సంబంధించిన కేసులు నమోదయ్యాయన్నారు. గతేడాది 22హత్యకేసులు, 109ఆస్తి సంబంధిత కేసులు, ఐదు నేరపూరిత హత్యలు, ఐదు దొమ్మికేసులు, 24 కిడ్నాప్ కేసులు, 27రేప్‌కేసులు, 24ఎస్సీఎస్టీ కేసులు, 20పోక్సో కేసులు, 17గంజాయికేసులు, 26సైబర్ నేరాల కేసులు,177మహిళలపై అఘాయిత్యాలకు సంబంధించిన కేసులు నమోదయ్యాయన్నారు. గత సంవత్సరంతో పోల్చగా హత్యకేసులు 45.4శాతం, ఆస్తి సంబంధిత నేరాలు 24.7శాతం, నేరపూరిత హత్యలు 40శాతం తగ్గాయన్నారు. దొమ్మికేసులు 20శాతం, కిడ్నాప్ కేసులు 20శాతం, రేప్ కేసులు 11.1శాతం,సైబర్‌నేరాలు 32శాతం తగ్గాయన్నారు. ఎస్సీఎస్టీ నేరాలు 41.6శాతం, పోక్సో కేసులు 35శాతం, మహిళలపై అఘాయిత్యాలు 6.2శాతం, గంజాయికేసులు 129.4శాతం పెరిగాయన్నారు. జిల్లాలో ఈ ఏడాది 133 రోడ్డు ప్రమాదాల్లో 60 మంది మృతిచెందగా 91మంది గాయపడ్డారన్నారు. గత సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది 1.6శాతం రోడ్డు ప్రమాదాలు తగ్గాయన్నారు. ఎస్సీఎస్టీకేసులలో 34 కేసులు నమోదు కాగా బాధితులకు పరిహారం కోసం ఫైళ్లను కలెక్టర్‌కు పంపించామన్నారు. ఈఏడాది 82 ఆస్తి సంబంధిత నేరాల్లో రూ.62.08 లక్షలు విలువగల నగదు, ఆభరణాలు ఇతర వస్తువులు దొంగతనం కాగా 37కేసులనుగుర్తించి రూ.15.33 లక్షలను రికవరీ చేశామన్నారు. జిల్లాలో గతేడాదితో పోలిస్తే సైబర్ నేరాలు పెరిగాయన్నారు. ఈ ఏడాది అన్నికేసులుకలిపి 48మందికి శిక్షలు పడ్డాయన్నారు. ఈ ఏడాది లోక్ అదాలత్‌ల ద్వారా 2378 కేసులను రాజీకుదిర్చామన్నారు. పీడీఎస్ అక్రమరవాణాపై 100కేసులు నమోదు చేసి 170మందిని అరెస్టుచేసి 1221.8క్వింటాళ్ల బియ్యాన్నిసీజ్ చేశామన్నారు. గేమింగ్ యాక్టు, జూదం కింద 151 కేసుల్లో 605 మందిపై కేసులు నమోదుచేసి రూ.4.83లక్షలను సీజ్ చేశామన్నారు. జిల్లాలో 39 గంజాయి కేసులను నమోదుచేసి 65మందిని అరెస్టు చేసి 298.855కిలోల, 121 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నామన్నారు. 45పశువుల అక్రమ రవాణా కేసులు నమోదుచేసి 130మంది నిందితులను అరెస్టు చేసి 628పశువులను రక్షించామన్నారు. జిల్లాలో 129 మంది బాలకార్మికులను పనులనుంచి విముక్తి చేశామన్నారు. 1290డ్రంకన్ డ్రైవ్ కేసులలో 63,628 ఈచాలన్ల ద్వారా రూ.1.13కోట్ల జరిమానాలు విధించామన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీప్రభాకర్‌రావు,డీఎస్పీలు కరుణాకర్, రామానుజం, జిల్లాలోని సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

**పెండింగ్ కేసులు లేకుండా చర్యలు తీసుకోవాలి..**

పెండింగ్ కేసులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు అధికారులతో నిర్వహించిన నెలవారీ సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతికేసును క్వాలిటీ ఇన్వెస్టిగేషన్‌తో పూర్తి పారదర్శకంగా ఛేదించాలన్నారు. పోక్సో, గ్రేవ్ కేసుల్లో త్వరగా ఇన్వెస్టిగేషన్ పూర్తిచేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలన్నారు. సైబర్‌క్రైం, డయల్100 వాటి వినియోగంపై విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, వారి ఫిర్యాదులను స్వీకరించి జవాబుదారీగా ఉండాల న్నారు. ప్రతిరోజు డ్రంకెన్‌డ్రైవ్ నిర్వహించాలన్నారు. ఓవర్ స్పీడ్, ట్రిబుల్ డ్రైవింగ్, మైనర్లు వాహనాలు నడపటం లాంటి వాటిపై ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. నూతన సంవత్సరం వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఏఎస్పీ ప్రభాకర్‌రావు, డీఎస్పీలు కరుణాకర్, రామానుజన్, సీఐలు, ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## టీడీపీ సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలి



సభ్యత్వ నమోదు చేపడుతున్న గుళ్లపల్లి ఆనంద్

కాగజ్‌నగర్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయా లని ఆదిలాబాద్ టీడీపీ పార్లమెంటు కన్వీనర్ గుళ్లపల్లి ఆనంద్ అన్నారు. శనివారం కాగజ్‌నగర్ పట్టణంలోని 12వవార్డులో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల కోసం పోరాడేది కేవలం టీడీపీ అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుళ్లపల్లి లావణ్య, సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా శని త్రయోదశి

కాగజ్‌నగర్/రెబ్బెన, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ శనిమందిర్‌లో, రెబ్బెన మండలం ఇందిరానగర్‌లోని మహంకాళిదేవస్థానంలో శనివారం శనిత్రయోదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శనీశ్వరుడికి తైలాభిషేకాలు, నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

## శౌర్యదివస్‌ను ఘనంగా జరుపుకోవాలి

వాంకిడి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): జనవరి 1న జిల్లా వ్యాప్తంగా కోరేగావ్ శౌర్యదివస్‌ను ఘనంగా జరుపుకోవాలని బౌద్ధమహాసభ జిల్లా అధ్యక్షుడు అశోక్ మొౌల్కర్, సమాజ్ క్రాంతి అగాడి అధ్యక్షుడు తిరుపతి ఒక ప్రకటనలో కోరారు.

## గంభీరావుపేటలో బాలమేళా

తిర్యాణి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): చిన్న పిల్లలో విద్య పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలు, కథలతో విద్యాబోధన చేస్తున్నట్లు సీడీపీవో సాధియా రుక్సానా తెలిపారు. శనివారం గంభీరావుపేట అంగన్‌వాడీ కేంద్రంలో బాలమేళ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 3నుంచి 5సంవత్సరాల లోపు పిల్లలను అంగన్‌వాడీకేంద్రాలకు పంపించాల న్నారు. ప్రతి రోజు పౌష్టికఆహారం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంతోపాటు పిల్లల్లో ఎదుగుదల ఉంటుందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్, మాజీ ఉపసర్పంచ్‌లు వరలక్ష్మి, రాణి, సూపర్‌వైజర్ తిరుపతమ్మ, అంగన్‌వాడీ టీచర్లు మల్లీశ్వరి, కమల, ప్రేమల, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలి

కెరమెరి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్ మెంట్ సాధనకై బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో జనవరి8న నిర్వహించే చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు లవ్‌కుమార్ కోరారు. శనివారం చలో హైదరాబాద్‌కు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ వృత్తి విద్యా కోర్సులు చేస్తున్న 12లక్షల మంది విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయలేదన్నారు. వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వినేష్, రమేష్, బాలు, శ్రీకాంత్, రాజేశ్వర్, సుభాష్, శ్రీను, సునీల్, వెంకటేష్, మల్లేశ్వరి, ప్రియాంక, గోపిక, అశ్విని తదితరులు పాల్గొన్నారు.